క్లుప్తంగా

నేడు 'మనూ' ఐటీఐ అడ్మిషన్ కౌన్సిలింగ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఐటీఐ)హైదరాబాద్‌లో ఉన్న ఖాళీ సీట్ల భర్తీ కోసం అడ్మిషన్ కౌన్సిలింగ్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి గచ్చిబౌలిలోని ఉర్దూ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఐటీఐ భవనం లో కౌన్సిలింగ్‌ను నిర్వహిస్తామన్నారు. అందుకోసం అర్హులైన వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వ్యక్తిగతంగా కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్ 040-23008428, సెల్ నెంబర్ 9440692452లో సంప్రదించాలని కోరారు.

23 నుంచి జ్ఞాన యజ్ఞ మహోత్సవం

మోతీనగర్: మోతీనగర్‌లోని శృంగేరి శారదా శంకరమఠం ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. బ్రహ్మశ్రీ తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు సప్తాహ మహాత్య కార్యక్రమం ఉంటుందన్నారు.

అంతర్జాతీయ శాంతి ధృవ స్థాపన దినోత్సవం

హఫీజ్‌పేట్: నానక్‌రామ్‌గూడలోని ది శ్రీరామ్ యూనివర్సల్ పాఠశాలలో గురువారం అంతర్జాతీయ శాంతి ధృవ స్థాపన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ విద్యావేత్త, ఆర్‌సీజే హెచ్ మాజీ అధ్యక్షురాలు రోటేరియన్ ఝాన్సీ ప్రేమానంద్, అసిస్టెంట్ గవర్నర్ రోటేరియన్ సురేష్ గుప్తా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, రోటేరియన్ డాక్టర్ జ్యోతి రెడ్డి, కార్యదర్శి వజ్రల రాజ గోపాల్‌లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మోతీనగర్: అల్లాపూర్ ప్రధాన రోడ్డు పెట్రోల్ బంకు సమీపంలో అక్రమంగా నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని గురువారం జీహెచ్ఎంసీ మూసాపేట సర్కిల్ పట్టణ ప్రణాళిక అధికారుల పర్యవేక్షణలో కూల్చివేశారు. బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆకస్మికంగా పర్యటించినప్పుడు ఆయన అక్రమ నిర్మాణాలు పరిశీలించారు. వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. దీంతో రెండు రోజుల నుంచి డివిజన్‌లో ఎక్కడెక్కడ అక్రమ నిర్మాణాలు, నాలాల పక్కన ప్రమాదకరంగా ఉన్న నిర్మాణాలను కూల్చివేయటానికి శ్రీకారం చుట్టారు.

ఎంటెక్, యూజీ-సీయూఈటీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం కోసం సీయూఈటీలో అర్హత సాధించిన అర్హతగల అభ్యర్థులకు స్పాట్ అడ్మిషన్లను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ గురువారం తెలిపారు. ముఖ్యంగా బీఏ, బీఏ(జేఎంసీ) బీకామ్, బీఎస్సీ కోర్సులతోపాటు ఎంటెక్, సీఎస్ఈ(ఏఐ, ఎంఎల్) వంటి కోర్సులకు ఈ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. అంతే కాకుండా యూనివర్సిటీలో స్పాన్సర్డ్/సెల్ఫ్ ఫైనాన్స్ మోడ్‌లో పార్ట్‌టైమ్ ప్రోగ్రామ్‌ల కోసం ఆన్‌లైన్ పోర్టల్ ఈనెల 23, 24 తేదీలలో ఓపెన్ అవుతుందన్నారు. ఇప్పటికే 'మనూ'ను ఎంపిక చేసుకున్న అభ్యర్థులు, ఎంచుకోవడంలో విఫలమైన, అర్హత సాధించని, సీయూఈటీలో ఉర్దూను లాంగ్వేజ్ ఆప్షన్‌గా ఎంచుకోని అభ్యర్థులు ఉర్దూగా చదివి ఉంటే కూడా యూజీ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. పది లేదా ప్లస్ టూ స్థాయిలో భాష లేదా బోధనా మాధ్యమం ఉర్దూ తప్పనిసరిగా ఉండాలన్నారు. 22 నుంచి 24వ తేదీ వరకు వివిధ మెరిట్ బేస్డ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సులు, టీచింగ్ ఇంగ్లిష్‌లో పీజీ డిప్లొమోలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు.

ముగిసిన విజ్ఞానోత్సవ్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ స్టడీస్ (సీఐఎస్)తో అనుబంధంగా ఉన్న జూనియర్ సైన్స్ క్లబ్ (జేఎస్‌సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక సైన్స్‌ఫెస్ట్-విజ్ఞానోత్సవ్-2023 ముగిసింది. కార్యక్రమానికి ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ గ్రాంట్, ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్ నిధులను సమకూర్చాయి. స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ స్టడీస్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, సీఐఎస్ డైరెక్టర్ డాక్టర్ సంజయ్‌సుబోధ్, జేఎస్సీ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కె మురళీధరన్,ఐఈఓఏ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం ఘనశ్యామ్‌కృష్ణ చేతుల మీదుగా ప్రారంభించారు.

విద్యార్థుల మధ్య వైరం

రోడ్డుపైనే కొట్టుకున్న వైనం

మూసాపేట: బాలాజీనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో సెకండియర్ చదువుతున్న విద్యార్థులు రోడ్డుపైనే ఒకరిపైఒకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు. ఈ సంఘటన కూకట్‌పల్లి పీఎస్ పరిధిలో చోటు చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కళాశాలలో పార్కింగ్ వద్ద బైక్‌లు తగిలి ఇద్దరు క్లాస్‌మేట్‌ల మధ్య వాగ్వాదం జరిగింది. ఇంటికి వెళ్లాక దెబ్బలు తిన్న అబ్బాయి తన తండ్రికి చెప్పటంతో అతను విద్యార్థికి ఫోన్ చేసి మాట్లాడుతుండగా ఆ విద్యార్థి సీరియస్‌గా మాట్లాడటంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. ఆ క్లాస్‌మేట్ కూడా పోలీస్‌స్టేషన్‌కు వస్తుండటంతో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద మరో ఇద్దరు విద్యార్థులు అడ్డగించి కొట్టారు. దీంతో దవడకు, నెత్తికి దెబ్బలు తగలడంతో ఆసుపత్రికి తరలించారు. దీంతో ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నిమజ్జనానికి సర్వం సిద్ధం



- జోనల్ కమిషనర్ మమత
- ఎనిమిది చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు
- ప్రతి చెరువు వద్ద ఇన్‌చార్జ్‌గా ఉప కమిషనర్
- 24గంటలు అందుబాటులో వివిధ శాఖల అధికారులు



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోన్ పరిధి కూకట్‌పల్లి, మూసాపేట, కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్ సర్కిళ్ల పరిధిలోని ఎనిమిది చెరువుల్లో నిమజ్జన ఏర్పాట్లు పూర్తి చేశామని సాక్షికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో జోనల్ కమిషనర్ మమత తెలిపారు. సుమారు 184 మంది సిబ్బందితో పాటు అన్ని శాఖల అధికారులు 24/7 అందుబాటులో ఉండేలా షెడ్యూల్ రూపొందించామని ఆమె పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా సేవలందించేందుకు ప్రత్యేక బృందాలను నియమించామని తెలిపారు. భక్తులకు తాగునీటి వసతితో పాటు వైద్య సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

◆ ఐడీఎల్ చెరువులో 10వేల విగ్రహాల నిమజ్జనం..

మినీ ట్యాంక్‌బండ్‌గా పేరొందిన ఐడీఎల్ చెరువులో వద్ద సుమారు 10వేల విగ్రహాలు నిమజ్జనం అవుతాయని ఆమె పేర్కొన్నారు. మూడో రోజు నుంచే నిమజ్జనం ప్రారంభమైనట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే 7 క్రేన్లను ఏర్పాటు చేసి ప్రత్యేక సిబ్బందిని నియమించామన్నారు. ప్రతి క్రేన్ వద్ద జీహెచ్ఎంసీ సిబ్బందితో పాటు పోలీస్, డీఆర్ఎఫ్, గజ ఈతగాళ్లను నియమించామని తెలిపారు. విగ్రహాల నిమజ్జనం తర్వాత ఎప్పటికప్పుడు చెరువులను శుభ్రపర్చేందుకు సిబ్బందిని నియమించాలని పేర్కొన్నారు.

◆ ప్రతి చెరువు వద్ద 23మంది అధికారులు

సర్కిల్ పరిధిలోని సున్నం చెరువు, బోయిని చెరువు, ప్రగతినగర్ చెరువు, వెన్నెలగడ్డ చెరువు, పరికి చెరువు, లింగం చెరువు, కొత్త చెరువు ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఒక్కో చెరువు వద్ద 23 మంది అధికారులను నియమించినట్లు జెడ్సీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి చెరువు వద్ద ఉప కమిషనర్ ఇన్‌చార్జ్‌గా ఉంటారన్నారు. ఉపకమిషనర్ అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ నిమజ్జనం సజావుగా జరిగేలా చూస్తారన్నారు.

◆ సమన్వయం చేసేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

ముఖ్యంగా ఇంజినీరింగ్, మెడికల్ హెల్త్, రెవెన్యూ బృందాలతో పాటు పోలీస్, ట్రాఫిక్, విద్యుత్ శాఖ, యూబీడీ, మెట్రో వాటర్ వర్క్స్, ఆర్అండ్‌బీ విద్యుత్ దీపాల ఏర్పాట్లకు జీహెచ్ఎంసీ విద్యుత్, ఆర్టీసీ, ఫైర్‌స్టేషన్ అధికారులు ఎప్పటికప్పుడు చెత్తను తరలించేందుకు రామ్‌కీ సంస్థ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. వీరందరిని సమన్వయం చేసేందుకు ఓ కంట్రోల్ రూమ్ అధికారిని కూడా నియమించినట్లు తెలిపారు.

◆ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు

కూకట్‌పల్లి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వన్ వే ద్వారా వినాయకులను నిమజ్జనం చేసే విధంగా ఏర్పాట్ల ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపారు. 10 నిమిషాల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగినా గంటల పాటు జాతీయ రహదారిపై ఒత్తిడి పెరుగుతుందనే ఉద్దేశంతో వాహనాలను విడతల వారీగా పంపించేందుకు ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు.

◆ కూకట్‌పల్లిలోని ప్రగతినగర్ చెరువు వద్ద ట్రాఫిక్ స్తంభించే అవకాశం ఉన్నందున వాహనాలు వచ్చేందుకు ఒక మార్గం... వెళ్లేందుకు మరో మార్గాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందుకోసం ట్రాఫిక్ ఉన్నతాధికారులతో చర్చించి రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు.

◆ విద్యుద్దీపాలతో చెరువు పరిసరాలను తీర్చిదిద్దాం...

భక్తులు వినాయక నిమజ్జనంతో పాటు అహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించే విధంగా విద్యుద్దీపాలతో చెరువు పరిసరాలను అలంకరించామని తెలిపారు. నగరంలోని ట్యాంక్‌బండ్‌ను తలపించే విధంగా ఐడీఎల్ చెరువు రోడ్డును కూడా సుందరంగా తీర్చిదిద్దామన్నారు. చిన్న చిన్న విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అన్ని చెరువుల వద్ద బేబీ పాండ్‌లను కూడా సిద్ధం చేశామని వివరించారు. విద్యుత్‌కు అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

వినాయక నిమజ్జనాలను పర్యవేక్షిస్తున్న అధికారుల వివరాలు

అధికారి శాఖ	పేరు	ఫోన్ నంబర్
జోనల్ కమిషనర్	మమత	98499 05774
డీసీపీ	శ్రీనివాసరావు	87126 63011
మూసాపేట డీసీ	రమేష్	77023 04863
కూకట్‌పల్లి డీసీ	కృష్ణయ్య	73375 57245
కుత్బుల్లాపూర్ డీసీ	నాగమణి	63090 29533
గాజులరామారం డీసీ	మల్లారెడ్డి	63095 29286
అల్వాల్ డీసీ	శ్రీనివాసరెడ్డి	89854 09173

మహిళా బిల్లుపై కవిత మాట్లాడటం విడ్డూరం

- 119 సీట్లలో 33శాతం మహిళలకు ఇచ్చి మాట్లాడాలని హితువు
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్‌రావు



మార్పు కోసం పాదయాత్రలో భాగంగా ప్రగతినగర్ నుంచి పాదయాత్ర చేస్తున్న నేతలు

అల్విన్‌కాలనీ: ప్రగతినగర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్‌రావు ఆధ్వర్యంలో గురువారం «మార్పు కోసం పాదయాత్ర» డివిజన్ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. బస్తీల్లో పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ... ప్రజల్లో ఎక్కడ చూసినా బీఆర్ఎస్‌పై తీవ్ర వ్యతిరేకత కనబడుతోందన్నారు. కేవలం బీఆర్ఎస్ మాటలకే పరిమితమైందని విమర్శించారు.

◆ పార్లమెంట్‌లో నరేంద్ర మోదీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి బిల్లును ఆమోదం చేయిస్తే రాష్ట్రంలో ఎమ్మెల్సీ కవిత హద్దు మీరి తన వల్లనే సాధ్యమైందని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కవిత ముందు 119 నియోజకవర్గాలకు 33 శాతం మహిళలకు సీట్లు కేటాయించి మాట్లాడాలని సూచించారు. మహిళా రిజర్వేషన్ పట్ల దేశ ప్రజలందరూ నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలపటం చాలా సంతోషకరమైన విషయమన్నారు.

◆ రానున్న ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కి బుద్ధి చెప్పి బీజేపీని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, కుమార్ యాదవ్, శ్రీలత, ఇంద్రారెడ్డి, శ్రీనివాస్, వైస్‌ప్రెసిడెంట్ మాధురి, జనరల్ సెక్రటరీ అరుణ, ఉమ, రేణుక, సంధ్య, కవిత, లక్ష్మి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షలు

మహిళా బిల్లు కోసం పోరాడి విజయం సాధించి కేంద్ర ప్రభుత్వం బిల్లు పెట్టే విధంగా చేసిన ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందడంతో మేయర్ గద్వాల విజయలక్ష్మితో పాటు కార్పొరేటర్లు సబిహా బేగం, రోజాదేవి, మంజులారెడ్డి గురువారం ఎమ్మెల్సీ కవితను ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

– అల్విన్‌కాలనీ/మోతీనగర్





నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి



అంబీర్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్న కార్పొరేటర్

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు వద్ద వినాయక నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన బేబీ పాండ్‌ను కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనం సజావుగా జరిగేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్లు చేయాలన్నారు. ఒకొక్క పాయింట్ వద్ద రెండు పెద్ద క్రేన్లు, ఒక చిన్న క్రేన్ ఏర్పాటు చేయాలని సూచించారు. పాండ్‌లో తగినంత నీరు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం ప్రాంతంలో గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, బ్లీచింగ్ పౌడర్ అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పునరుత్పాదక ఇంధన వనరుల పెరుగుదలలో ప్రగతి

రాయదుర్గం: ఇంధన మిశ్రమంలో పునరుత్పాదక ఇంధన వనరుల పెరుగుదలలో ఎంతో ప్రగతి కనిపిస్తోందని పీజీసీఐఎల్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా లో పీజీసీఐఎల్ ఎగ్జిక్యూటివ్‌ల కోసం 'రెన్యూవబుల్ ఎనర్జీ జనరేషన్-గ్రిడ్ ఇంటిగ్రేషన్ అంశాలు-బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్‌పై అనుకూలీకరణ' అంశంపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావుతో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

తొలిమెట్టు కార్యక్రమాల పరిశీలన

కూకట్‌పల్లి: మేడ్చల్ జిల్లాలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో అమలవుతున్న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలతో పాటు వయోజన విద్యపై అంశాలను పరిశీలించడానికి రాష్ట్ర స్థాయి నుంచి ఎస్‌సీఈఆర్‌టీ, అడల్ట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ బృందాలు జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. గురువారం కూకట్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాలో తొలిమెట్టు రిసోర్స్ పర్సన్‌లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో విషయ నిపుణులు సువర్ణ వినాయక్, వారి బృందంతో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ రవీందర్‌రాజుతో కలిసి ఈ సమావేశంలో జిల్లాల పరిశీలించిన అంచాలను పరిగణనలోకి తీసుకొని అభినందించారు. ఇంకా ఏ అంశాలపై దృష్టి సారించాలో ఆ అంశాలను తెలియజేశారు. జిల్లాలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందిస్తూ ఈ కార్యక్రమాన్ని ఇంకా ప్రత్యేక దృష్టి సారిస్తూ ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడల్ట్ డైరెక్టర్ ఉషారాని, రవికాంత్, అర్జున్, రవి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మూసాపేటలోని భారీ వినాయకుడికి పూజలు చేస్తున్న బీఆర్ఎస్ కార్మిక నాయకుడు రవిసింగ్

మంగళ మూర్తి మోరియా

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పులిహోర, దద్ధ్యోదనం, పండ్లను నైవేద్యంగా గౌరీ తనయుడికి సమర్పించారు. ఈ పూజల్లో కార్పొరేటర్లు, పలు పార్టీల నాయకులు పాల్గొని వినాయకుడిని దర్శించుకున్నారు. కాలనీల్లోని పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. – కూకట్‌పల్లి





భరత్‌నగర్‌కాలనీలో దశావతార, తబలపై నాట్యం చేస్తున్న వినాయక విగ్రహాలు



పర్వత్‌నగర్‌లో గణనాథుడికి పూజలు చేస్తున్న మహిళా భక్తులు



దత్తాత్రేకాలనీలో అన్నదానం చేస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



శ్రీ వివేకానందనగర్‌లో గణపతి పూజలో సమితి అధ్యక్షుడు మస్తాన్‌రెడ్డి



శ్రీసాయి శివశక్తి యూత్ అసోసియేషన్ మండపంలో కార్పొరేటర్ సతీష్‌గౌడ్



మారుతీనగర్‌లో జరిగిన గణేశ్ పూజలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్



శేషాద్రినగర్ కమిటీహాల్‌లో జరిగిన పూజలో కార్పొరేటర్ సత్యనారాయణ దంపతులు




కూకట్‌పల్లి డివిజన్‌లో వినాయక మండపంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు

ఆకట్టుకుంటున్న మండపాలు



ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో అంజయ్యనగర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ప్రతి ఏడాది వినూత్నంగా మండపాలను ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది కూడా అదే తరహాలో మండప సెట్టింగ్ వేయించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

- ఓల్డ్ బోయిన్‌పల్లి



రూ.125 కోట్లతో నాలా పనులు చేపడతాం

- పాదయాత్రలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- డ్రైనేజీ, నాలా సమస్యలే అధికంగా వస్తున్నాయని వెల్లడి
- వరకు 8 డివిజన్లలో పాదయాత్ర పూర్తి

కూకట్‌పల్లి: నియోజకవర్గంలో చేపట్టిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాదయాత్ర 39వ రోజుకు చేరుకుంది. బాలాజీనగర్ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో గురువారం ఆయన కార్పొరేటర్ శిరీషతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో వేల కోట్ల రూపాయలతో నియోజకవర్గంలో మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ, ట్రాఫిక్ వంటి అనేక సమస్యలను నిర్మూలించామన్నారు. నియోజకవర్గంలో నేటితో 8 డివిజన్లలో పాదయాత్ర పూర్తి చేసుకున్నామని తెలిపారు. ఈ పాదయాత్రలో ముఖ్యంగా డ్రైనేజీ సమస్యలనే గుర్తించామని పేర్కొన్నారు. రూ.50కోట్లతో డ్రైనేజీ వ్యవస్థకు శంకుస్థాపన చేస్తున్నామని తెలిపారు.

◆ రూ.500 కోట్లతో ఎస్టీపీ వ్యవస్థ ఏర్పాటు చేశాం..

◆ భారీ వర్షాలు కురిసినప్పుడు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగా జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌తో ఫతేనగర్, అల్లాపూర్ డివిజన్లలో నాలాలను పరిశీలించామన్నారు. వాటికి రూ.125 కోట్లతో నాలా పునర్ నిర్మాణ పనులు చేపట్టబోతున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ఎస్టీపీ వ్యవస్థని రూ.500 కోట్లతో ఏర్పాటు చేశామన్నారు. ఈ పనులు కూడా చివరి దశలో ఉన్నాయని తెలిపారు.

◆ 4400 మందికి 'డబుల్'ఇస్తాం..

ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా వాటికి సత్వరమే పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్‌రూమ్‌లు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎనిమిది విడతలుగా 4400 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందజేస్తామని తెలిపారు.





పాదయాత్రలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష, నాయకులు



పాదయాత్రలో నివాసాల మధ్య చెత్తా చెదారం ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే